ముంపు నుంచి శాశ్వత పరిష్కారం చూపాలి

భద్రాచలం, జూలై 27: గోదావరి ముంపు నుంచి భద్రాచలం పట్టణ రక్షణకు శాశ్వత పరిష్కారం చూపాలని సీపీఎం నాయకులు ఎంబీ నర్సారెడ్డి, గడ్డం స్వామి సంబంధిత అధికారులను కోరారు. శనివారం ఏటపాకలోని కరకట్ట స్లూయిస్‌లు లీక్ కావడంతో పాటు వర్షపు నీరు బ్యాక్ వాటర్‌తో పట్టణంలోని ఏఎంసీ కాలనీ, కొత్తకాలనీ, అశోక్ నగర్‌కాలనీలు ముంపునకు గురయ్యాయి. వారు అధికారులతో మాట్లాడి ముంపునకు గురైన కాలనీల ప్రజలను స్థానిక నన్నపనేని మోహన్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి తరలించి, వరద సహాయక చర్యల్లో పాల్గొన్నారు. ముంపునకు గురైన కుటుంబాలకు రూ.10వేలు నష్టపరిహారం అందించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు వైవీ రామారావు, సంతోష్‌కుమార్, యు జ్యోతి, సత్యవతి, నర్సింహారావు, సీత, గోవర్ధన, ఝాన్సీ, సరోజిని, పూర్ణ రాము పాల్గొన్నారు.

బూర్గంపహాడ్: నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్

సారపాక: సారపాక-నాగినేనిప్రోలు రెడ్డిపాలెం ప్రధాన రహదారి వద్ద ప్రవహిస్తున్న గోదావరి వరదనీరు

బాధితులను పునరావాస కేంద్రాలకు తరలింపు..

బూర్గంపాడు, జూలై 27: గోదావరి వరద ఉధృతి పెరగడంతో వరద ముంపునకు గురయ్యే కొత్తకాలనీ, ఏఎంసీ కాలనీ, అశోక్‌నగర్ గ్రామాల ప్రజలను నన్నపనేని స్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి శనివారం అధికారులు తరలించారు. భద్రాచలం సబ్ కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో ముంపు కాలనీల ప్రజలకు గోదావరి వరదల వల్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ తమ కాలనీలకు గోదావరి వరద వచ్చినప్పుడు వరదల కంట్రోల్ రూంకు సమాచారం ఇస్తే ఎన్‌డీఆర్‌ఎఫ్ బృందం సహాయంతో ఆస్తి నష్టం, ప్రాణనష్టం జరగకుండా జాగ్రత్త పడవచ్చని అన్నారు. గోదావరి వరద పెరుగుతున్నందున ఎటపాక వాగు 20 రోజుల క్రితం మూసివేసామని పేర్కొన్నారు. రాబోయే రెండు రోజులు భారీ వర్ష సూచన కారణంగా కొత్త కాలనీ, అశోక్‌నగర్, ఏఎంసీ కాలనీ వాసులు లోతట్టు ప్రాంత వాసులు నన్నపనేని హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి వెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో భద్రాచలం ఆర్డీవో దామోదర్‌రావు, ఇరిగేషన్ ఈఈ రాంప్రసాద్, ఎన్‌డీఆర్‌ఎఫ్ కమాండర్ భూపేందర్ రావు, పంచాయతీ ఈవో శ్రీనివాస్ పాల్గొన్నారు.

సారపాకలో..

సారపాక, జూలై 27: భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం బూర్గంపహాడ్ మండలంలో 50 అడుగులకు ప్రవాహం చేరితే పరివాహక ప్రాంతమైన బూర్గంపహాడ్ మండలంలో సోంపల్లి వద్ద, ఇరవెండి-అశ్వాపురం, సారపాక-నాగినేనిప్రోలు రెడ్డిపాలెం, బూర్గంపహాడ్-నాగినేనిప్రోలు రెడ్డి పాలెం గ్రామాల మధ్య ప్రధాన రహదారులపైకి వరదనీరు వచ్చి చేరడంతో రహదారుల రాకపోకలు నిలిచిపోయాయి. మోతేపట్టీనగర్‌లో సమ్మక్క, సారలమ్మ గద్దెలు సైతం వరదనీటిలో మునిగిపోయాయి. తహసీల్దార్ ముజాహిద్, ఎస్సై రాజేశ్, ఎంపీడీవో జమలారెడ్డి, నీటిపారుదలశాఖ అధికారులు, పంచాయతీ కార్యదర్శులు మండలంలోని ముంపు ప్రభావిత గ్రామాల్లో ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. నాగినేనిప్రోలు రెడ్డిపాలెంలో రెండు కుటుంబాలను జడ్పీహెచ్‌ఎస్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రానికి అధికారులు తరలించారు. సారపాక బీపీఎల్ స్కూల్‌తో పాటు మండలంలో 13 పునరావాస కేంద్రాలు ఇప్పటికే ఏర్పాటుచేసి ముంపు వాసులను అక్కడ పునరావాసం పొందాలని చెబుతున్నారు. అధికారులతో పాటు ఎంపీవో సునీల్‌శర్మ, ఆర్‌ఐలు నర్సింహారావు, ముత్తయ్య, కార్యదర్శులు కంది మహేష్, మండల పరిషత్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

ముంపు ప్రజలు పునరావాస కేంద్రానికి రావాలి..

అశ్వాపురం, జూలై 27: భద్రాచలం వద్ద గోదావరి వరద ప్రవాహం పెరుగుతుందని, ముంపునకు గురయ్యే లోతట్టు ప్రాంత ప్రజలు ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలకు తరలిరావాలని అశ్వాపురం సీఐ అశోక్‌రెడ్డి సూచించారు. శనివారం మండలంలోని నెల్లిపాక బంజర్ పంచాయతీలో ముంపు ప్రాంతాలను ఆయన పరిశీలించి అక్కడే ఉన్న ప్రజలతో మాట్లాడారు. గోదావరి వరద మూడవ ప్రమాద హెచ్చరికను దాటి ప్రవహిస్తుందని, వరద మరింత పెరిగే ప్రమాదం ఉందని తమ ఇళ్లను ఖాళీ చేసి పునరావాస కేంద్రాలకు తరలివెళ్లాలని సూచించారు.

కేంద్రాల్లో సౌకర్యాలు కల్పించాలి ..

భద్రాచలం, జూలై 27: గోదావరికి వరద పెరుగుతున్నందున ముంపు కాలనీల ప్రజలను పునరావాస కేంద్రాలకు తరలించి, అన్ని సౌకర్యాలు కల్పించాలని బీఆర్‌ఎస్ నాయకులు ఆకోజు సునీల్ కుమార్ అన్నారు. శుక్రవారం బీఆర్‌ఎస్ కార్యాలయంలో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. గర్భిణులకు, చిన్న పిల్లలకు పాలు, గుడ్లు, పోషకాహారం అందించాలన్నారు. సమావేశంలో అయినాల రామకృష్ణ, దానియేలు ప్రదీప్ లక్ష్మణ్, బడిశా నాగరాజు, చిట్టిమల్ల అనీల్, జల్లి రామకృష్ణ, తెల్లం రాణి, యాదామని పాల్గొన్నారు.

పునావాస కేంద్రాన్ని సందర్శించిన డీఎంహెచ్‌వో

మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో భాస్కర్‌నాయక్

బూర్గంపాడు, జూలై 27: స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో ఏర్పాటు చేసిన వరద బాధితుల సహాయ కేంద్రాన్ని డీఎంహెచ్‌వో డాక్టర్ భాస్కర్ నాయక్ శనివారం సందర్శించారు. మూడు కుటుంబాలకు చెందిన 11మందిని పునరావాస కేంద్రంలో ఉంచారు. ఈ సందర్భంగా ఆయన ప్రజలతో మాట్లాడారు. మంచి వైద్యం అందించాలని, గర్భిణీలను తరలించాలని, 24 గంటల వైద్య సేవలు అందించాలని కోరారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి ఎం. లక్ష్మీసాహితి, డీపీఎంవో శ్రీను, హెచ్‌ఈవో రవి, ప్రియాంక, నాగమణి పాల్గొన్నారు.

రోడ్డుపై ప్రవహిస్తున్న వరదనీరు

రోడ్డుపై ప్రవహిస్తున్న వరదనీరు

బూర్గంపాడు, జూలై 27: మండలంలోని సారపాక పెట్రోల్ బంక్ సమీపంలో, ఇరవెండి గ్రామంలోని రోడ్లపై వరదనీరు ప్రవహిస్తోంది. బూర్గంపాడు కొల్లు చెరువు వద్ద గోదావరి రోడ్డుపైకి వచ్చి ప్రమాద స్థాయిలో ప్రవహిస్తోంది. దీంతో వాహనదారులు, ప్రజలు గమనించి ఈ రోడ్లపైకి రావొద్దని, గోదావరి వరదలు చూసేందుకు వెళ్లవద్దని పోలీసులు కోరుతున్నారు.

ముంపు ప్రాంతాలను పరిశీలించిన అధికారులు

పర్ణశాల, జూలై 27: వరద ముంపు గ్రామాలైన పర్ణశాల కాశీనగరం, సున్నంబట్టి గ్రామాలను శనివారం అధికారులు పరిశీలించారు. వరద పెరిగే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాల్లోకి వెళ్లాల్సి ఉంటుందని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ మణిధర్, ఎంపీడీవో ముత్యాలరావు, ఎస్సై గణేష్, ఇరిగేషన్ ఏఈ రాజ్ సుహాస్, రెవెన్యూ సిబ్బంది, పంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

పర్ణశాల వద్ద గోదావరి వరద పరిస్థితిని పరిశీలిస్తున్న అధికారులు

అశ్వారావుపేట ఎంపీవోగా ప్రసాదరావు

అశ్వారావుపేట టౌన్, జూలై 27: అశ్వారావుపేట మండల పంచాయతీ అధికారి(ఎంపీవో)గా ఎస్.ప్రసాదరావు శనివారం విధుల్లో చేరారు. ఆయన దుమ్ముగూడెం నుంచి ఇక్కడకు డిప్యుటేషన్‌పై వచ్చారు. అశ్వారావుపేట ఎంపీవో సీతారామరాజు సెలవులో ఉన్నారు.

ట్రిపుల్ ఐటీలో 'పేట' విద్యార్థినికి సీటు

అశ్వారావుపేట టౌన్, జూలై 27: అశ్వారావుపేటకు చెందిన విద్యార్థిని మానేపల్లి ప్రీతిక ప్రిన్సెస్‌కు బాసర ట్రిపుల్ ఐటీలో సీటు వచ్చింది. ఆమెను పలువురు అభినందించారు.

బ్రీతింగ్ ఎనలైజర్ మార్చాలని వినతి

కొత్తగూడెం అర్బన్, జూలై 27: ఆర్టీసీ డ్రైవర్లకు రోజూ ఉదయం ఉపయోగించే బ్రీతింగ్ ఎనలైజర్ మిషన్‌ను వెంటనే మార్చాలని కోరుతూ డిపో అధికారికి సీఐటీయూ నాయకులు శనివారం వినతిపత్రం ఇచ్చారు. ఈ మిషన్ పనిచేయడం లేదని, తప్పుడు రిపోర్ట్ ఇస్తున్నదని పేర్కొన్నారు. వీరన్న, భూక్యా రమేష్, బిక్కి బాలరాజు, కత్తి నరసింహారావు, సైదులు, శివ పాల్గొన్నారు.

ప్రభుత్వ ఆస్పత్రికి ఫ్యాన్లు వితరణ

గుండాల, జూలై 27: గుండాల ప్రభుత్వ ఆసుపత్రికి వాసవీ క్లబ్ అధ్యక్షుడు మానాల వెంకటేశ్వర్లు, మానాల నారాయణమూర్తి, ప్రధాన కార్యదర్శి పుల్లఖండం ఉపేందర్, ట్రెజరర్ అనుమోలు వెంకటేశ్వర్లు ఆర్థిక సాయంతో అందించిన ఫ్యాన్లు, లైట్లును వాసవిక్లబ్ గ్రీన్ ఫీల్డ్ మండల అధ్యక్షుడు మానాల వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో శనివారం అందచేశారు. పుల్లఖండ ఉపేందర్, తేరాల రాజేశ్వరరావు రోట్టెలు, పండ్లను రోగులకు అందించారు. కార్యక్రమంలో మానాల వీరన్న, ప్రభాకర్, శ్రావణ్, గౌరిశెట్టి సత్యనారాయణ, ప్రభాకర్, అయిత శ్రీశైలం, నాగమల్లయ్య, పూజిత్, నాగరాజు, రాంబాబు, సత్యం, వీరన్న పాల్గొన్నారు.

డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు ఆహ్వానం

అన్నపురెడ్డిపల్లి, జూలై 27: అన్నపురెడ్డిపల్లి మహాత్మ జ్యోతిబా పూలే తెలంగాణ వెనుకబడిన తరగతుల సంక్షేమ గురుకుల డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రత్యేకాధికారి బురాన్ తెలిపారు. ఆయన శనివారం విలేకరులతో మాట్లాడుతూ.. ప్రవేశ పరీక్ష రాసిన-రాయని విద్యార్థులు కూడా ఈ నెల 31వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవచ్చని చెప్పారు. బీఎస్సీ (ఎంపీసీఎస్), బీఎస్సీ (ఎంపీసీ), బీఎస్సీ (బీజెడ్‌సీ), బీకాం (సీఏ), బీకాం (జెన్), బీఏ (హెచ్‌పీఎస్) కోర్సులు ఉన్నాయని వివరించారు. ఇతర వివరాలకు 90594 90623, 83284 98711 సెల్ నంబర్లలో సంప్రదించవచ్చని సూచించారు.

రేపు దివ్యాంగులకు బస్ పాస్‌లు

టేకులపల్లి, జూలై 27: దివ్యాంగులకు బస్ పాస్‌లను ఆదివారం స్థానిక బోడు రోడ్డు సెంటర్‌లో ఇవ్వనున్నట్లు ఆర్టీసీ కొత్తగూడెం డిపో మేనేజర్ ఎం.దేవేందర్‌గౌడ్ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం10.00 నుంచి సాయంత్రం 4.00 గంటల వరకు ఈ కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు.

భద్రాద్రి రామయ్యకు స్వర్ణ తులసి పూజలు

నిత్య కల్యాణం జరుపుతున్న అర్చకుడు

భద్రాచలం, జూలై 27: భద్రాద్రి రామయ్యకు శనివారం అర్చకులు స్వర్ణ తులసి పూజలు జరిపారు. తెల్లవారుజామున ఆలయ తలుపులు తెరిచి సుప్రభాతం పలికి ఆరాధన, ఆరగింపు, సేవాకాలం, నిత్య హోమాలు, నిత్య బలిహరణం, తదితర నిత్య పూజలు చేశారు. అనంతరం స్వామివారి నిత్య కల్యాణ మూర్తులను బేడా మండపానికి తీసుకొచ్చి నిత్య కల్యాణం నిర్వహించారు. కల్యాణంలో పాల్గొన్న 22మంది దాతలకు స్వామివారి ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు.

సెయింట్ పాల్స్ పాఠశాలలో బోనాల సంబురాలు

బోనాలతో చిన్నారులు

భద్రాచలం, జూలై 27: పట్టణంలోని సెయింట్ పాల్స్ లూథరన్ పాఠశాలలో శనివారం బోనాల సంబురాలను నిర్వహించారు. ఈ సందర్భంగా హెచ్‌ఎం డాక్టర్ కే రాధామంజరి, ప్రిన్సిపల్ డాక్టర్ కే అబ్రహం మాట్లాడుతూ తెలంగాణలో మాత్రమే ఈబోనాల సంబురాలు జరుగుతాయన్నారు. విద్యార్థులు వివిధ వేషాధారణలో ఆటపాటలతో సందడి చేశారు.

వైద్య శిబిరాలు

మణుగూరు టౌన్, జూలై 27: మండలంలోని రాజీవ్‌గాంధీనగర్ బీసీ హాస్టల్, లంక మల్లారం టీజీ టీడబ్ల్యూయూఆర్‌జేసీల్లో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. వైద్యులు శివకుమార్ విద్యార్థులకు వైద్య పరీక్షలు చేసి అవసరమైన వారికి మందులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వానకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున విద్యార్థులు వ్యక్తిగత పరిశుభ్రత పాటించాలని, కాచి చల్లార్చిన నీటిని తాగాలన్నారు. కార్యక్రమంలో హెల్త్ అసిస్టెంట్స్ రాంప్రసాద్, ఉమేశ్, సుమా, ఎంఎల్‌హెచ్‌పీ వినయ్, వెంకటలక్ష్మి, సౌభాగ్య, ఆశా కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఎల్ఈడీ బల్బుల తయారీపై వర్క్‌షాప్

కొత్తగూడెం టౌన్, జూలై 27: ఎల్ఈడీ బల్బుల తయారీపై స్థానిక సింగరేణి ఉన్నత పాఠశాలలో శనివారం వర్క్‌షాప్ జరిగింది. నేషనల్ గ్రీన్ కార్ప్స్‌కు చెందిన 54 పాఠశాలల్లోని 163 మంది విద్యార్థులు హాజరయ్యారు. జిల్లా సైన్స్ ఆఫీసర్ చలపతిరాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ వర్క్‌షాప్‌లో ప్రభుత్వ పరీక్షల సహాయ కమిషనర్ మాధవరావు తదితరులు పాల్గొన్నారు.

ఆటల్లో నైపుణ్యం సాధించాలి

పాల్వంచ రూరల్, జూలై 27: క్రీడాపాఠశాల విద్యార్థులు తమకిష్టమైన ఆటల్లో నైపుణ్యం సాధించాలని ఐటీడీఏ పీవో రాహుల్ అన్నారు. మండలంలోని కిన్నెరసాని క్రీడాపాఠశాలను ఆయన శనివారం సందర్శించారు. విద్యార్థులతో, కోచ్‌లతో మాట్లాడుతూ.. సుశిక్షిత క్రీడాకారులుగా నిలిచేలా విద్యార్థులకు తర్ఫీదునిచ్చి, జాతీయ స్థాయిలో పతకాలు సాధించేలా కోచ్‌లు తీర్చిదిద్దాలని అన్నారు. కబడ్డీ, వాలీబాల్, ఆర్చరీ, అథ్లెటిక్స్ ఆటలను పరిశీలించారు. ఆర్చరీలో విద్యార్థులు వెనుకబడ్డారని కోచ్‌లతో పీవో చెప్పారు. ప్రత్యేక శ్రద్ధతో మెరుగ్గా తీర్చిదిద్దాలని సూచించారు. క్రీడల అధికారి గోపాల్‌రావు, కోచ్‌లు వాసు, రాంబాబు, ప్రసాద్, కల్తీ వెకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

సింగరేణి సీఎండీ ఫ్లెక్సీకి క్షీరాభిషేకం

క్షీరాభిషేకం చేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులు

కొత్తగూడెం సింగరేణి, జూలై 27: సింగరేణి సీఎండీ బలరాం ఫ్లెక్సీకి కొత్తగూడెంలోని కేంద్ర కార్యాలయం వద్ద కాంట్రాక్ట్ కార్మికులు శనివారం క్షీరాభిషేకం చేశారు. తమ సంక్షేమానికి సీఎండీ పాటుపడుతున్నారని, రూ.30 లక్షల బీమా సదుపాయంతోపాటు ఈఎస్ఐ ఆస్పత్రి ఏర్పాటుకు కృషి చేశారని ధన్యవాదాలు తెలుపుతూ ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇనుపనూరి నాగేశ్వరరావు, దొడ్డి నిర్మల, ఎడ్ల రాకేష్, బుల సత్యనారాయణ, సిహెచ్.శ్రీనివాస్, కె.చంద్రశేఖర్, పిట్టల శేఖర్, వీరు, రాజేష్, కళావతి, సుగుణ, మార్కెట్ అనిత, పంగా రాములు, అరుణ్, భాగ్యలక్ష్మి, అరుణ, మాధురి, సుభద్ర, సంతోష్, సందీప్, వెంకటేష్ పాల్గొన్నారు.

నేడు ఖమ్మంలో 'రాయల' సంతాప సభ

ఇల్లందు రూరల్, జూలై 27: సీపీఐ-ఎంఎల్ (మాస్‌లైన్) కేంద్ర కంట్రోల్ కమిటీ చైర్మన్ రాయల చంద్రశేఖర్ సంతాప సభ శనివారం ఖమ్మంలోని ఎస్‌ఆర్ గార్డెన్‌లో జరుగుతుందని ఆ పార్టీ నాయకులు చంద్ర అరుణ, నాయిని రాజు తెలిపారు. ఇల్లందులోని ఎల్లన్న భవనంలో శనివారం పార్టీ సమావేశంలో రాయల చంద్రశేఖర్ సంతా పసభ ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ.. సంతాప సభను పార్టీ శ్రేణులు, సానుభూతిపరులు జయప్రదం చేయాలని కోరారు. నాయకులు బుర్ర వెంకన్న, యదలపల్లి సావిత్రి, ఈసం శంకర్, రేస్ బోస్, పూన్నెం కుమార్, షేక్ యాకుబ్ షావలి తదితరులు పాల్గొన్నారు.

'మనుషుల' దొంగలున్నారు.. జాగ్రత్తగా ఉండాలి

మాట్లాడుతున్న సీఐ తాటిపాముల సురేశ్

టేకులపల్లి, జూలై 27: సాధారణ దొంగతనాలను చూశాం. దోపిడీ దొంగతనాలను చూశాం. కానీ, మనుషులను/పిల్లలను కూడా దొంగిలిస్తారని మీకు తెలుసా..? దీనినే 'మానవ అక్రమ రవాణా (హ్యూమన్ ట్రాఫికింగ్) అంటారు. ఈ నేరగాళ్ల ముఠా ప్రధానంగా అమాయకపు/పేదరికపు మహిళలను, యువతులను, బాలికలను లక్ష్యంగా చేసుకుంటుంది. ఈ సమస్యపై అందరిలోనూ అవగాహన పెంచేందుకు, అప్రమత్తంగా ఉండాలంటూ హెచ్చరించేందుకు స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఓ కార్యక్రమాన్ని యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్(ఏఐడీ) సంస్థ శనివారం నిర్వహించింది. ముఖ్య అతిథి, సీఐ సురేష్ మాట్లాడుతూ.. మానవ అక్రమ రవాణా అనేది నానాటికీ పెరుగుతున్నదని, ఇది వివిధ రూపాల్లో మారుమూల గ్రామాలకూ విస్తరిస్తున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. మానవ అక్రమ రవాణా నేరగాళ్లు మరీ ముఖ్యంగా మహిళలను, బాలికలను ఏదో ఒక రూపంలో 'మాయం' చేసి, అసాంఘిక శక్తులకు విక్రయిస్తారని చెప్పారు. ఎవరి మీదనైనా అనుమానం వస్తే వెంటనే దగ్గరలోని పోలీస్ స్టేషన్‌లో తెలపాలని, లేదా డయల్ 100 నంబర్‌కుగానీ, 1098 నంబర్ కుగానీ ఫోన్ చేసి తెలపాలని కోరారు. ఏఎస్ఐ వెంకటేశ్వర్లు, పాఠశాల హెచ్‌ఎం శ్రీనివాస్, ఏఐడీ బాధ్యుడు కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు.

రామయ్యను దర్శించుకున్న ప్రముఖులు


రామయ్య సన్నిధిలో జాయింట్ కలెక్టర్ ఎం.రామ్‌కిషన్, కుటుంబ సభ్యులు

భద్రాచలం, జూలై 27: భద్రాచలం సీతారామచంద్రస్వామిని గతంలో భద్రాద్రి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా విధులు నిర్వహించిన ఎం రామ్‌కిషన్, కుటుంబ సభ్యులు, రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి చైర్మన్ జనక్ ప్రసాద్ వేర్వేరుగా శనివారం దర్శించుకున్నారు. వారికి ఆలయ అధికారులు, అర్చకులు స్వాగతం పలికారు. తొలుత వారు ధ్వజస్తంభం వద్ద నమస్కరించుకొని అంతరాలయంలోని మూలవరుల వద్ద ప్రత్యేక పూజలు జరిపారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని ఉపాలయాలను సందర్శించి, తీర్థ,ప్రసాదాలు స్వీకరించారు. అర్చకులు వారికి లక్ష్మీతాయారమ్మ సన్నిధిలో వేదాశీర్వచనం చేసి, స్వామివారి ప్రసాదాలు, శేష వస్త్రాలను అందజేశారు. వారి వెంట ఆలయ పర్యవేక్షకుడు లింగాల సాయిబాబా, ఆలయ ప్రధానార్చకుడు పొడిచేటి సీతారామానుజాచార్యులు తదితరులు ఉన్నారు.

'పెదవాగు'ను సందర్శించిన ఏపీ మంత్రులు

అశ్వారావుపేట రూరల్, జూలై 27: మండలంలోని పెదవాగు ప్రాజెక్టుకు మూడుచోట్ల పడిన గండ్లను శనివారం ఏపీ రాష్ట్ర మంత్రులు అనిత, కె.అచ్చెన్నాయుడు, నిమ్మల రామానాయుడు, పార్థసారధి, పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు పరిశీలించారు. ఆ ప్రాజెక్టు ఆయకట్టు కింద ఏలూరు జిల్లా కుకునూరు, వేలేరుపాడు మండలాల్లో 14,000 ఎకరాల భూమి ఉంది. ప్రాజెక్టుకు గండి పడడంతో ఆ భూములన్నీ బీడుబారే ప్రమాదముంది. అక్కడి రైతుల విజ్ఞప్తితో ప్రాజెక్టును మంత్రులు సందర్శించారు. కుకునూరు, వేలేరుపాడు మండలాల్లోని ముంపు గ్రామాలను కూడా పరిశీలించారు.

గుబ్బల మంగమ్మ ఆలయానికి రావొద్దు

గుబ్బల మంగమ్మ రహదారికి గండి

అశ్వారావుపేట రూరల్, జూలై 27: మండలంలోని కావడిగుండ్ల పంచాయతీలోని దట్టమైన అటవీప్రాంతంలోగల గుబ్బల మంగమ్మ ఆలయానికి భక్తులెవరూ రావద్దని నిర్వాహకులు విజ్ఞప్తి చేస్తున్నారు. భారీ వర్షాలతో ఎక్కడికక్కడ చెరువులు, వాగులు పొంగుతున్నాయి. ఈ ఆలయానికి వెళ్లే రోడ్లు మునిగిపోతున్నాయి. ఈ కారణంగా, భక్తుల క్షేమం దృష్ట్యా గుబ్బల మంగమ్మ ఆలయానికి ఎవరినీ అనుమతించడం లేదని నిర్వాహకులు చెబుతున్నారు. ఆలయం వద్దకు భక్తులు రాకుండా చూసేందుకు గోగులపూడి, పందిరిమామిడి సమీపంలో గేట్లు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అనుమతి లేకుండా వచ్చి ఇబ్బందులు పడవద్దని హెచ్చరిస్తున్నారు. వర్షాలు-వరదలు తగ్గిన తర్వాత, పునర్దర్శనం ఎప్పుడనేది ప్రకటిస్తామని తెలిపారు. అప్పటి వరకు తమకు భక్తులు సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ఊరంతా శుభ్రం.. ఆరోగ్యం భద్రం

మాట్లాడుతున్న స్పెషలాఫీసర్ సంధ్యారాణి

చంద్రుగొండ, జూలై 27: ఊరంతా శుభ్రంగా ఉంటే.. అక్కడి ప్రజలకు ఎలాంటి వ్యాధులు సోకవని, వారి ఆరోగ్యం భద్రంగా ఉంటుందని చంద్రుగొండ పంచాయతీ ప్రత్యేకాధికారి సంధ్యారాణి అన్నారు. ఆమె శనివారం పంచాయతీ కార్యాలయంలో ప్రత్యేక గ్రామసభలో మాట్లాడారు. పారిశుధ్య సిబ్బంది ప్రతి రోజూ తడి-పొడి చెత్త సేకరించాలన్నారు. దోమలు పుట్టకుండా-కుట్టకుండా అందరూ జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. మురుగు నీటి నిల్వలపై ఆయిల్ బాల్స్ వేయాలని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి శివ, జిల్లాపరిషత్ కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ రసూల్, ఎంపీటీసీ సభ్యురాలు లంకా విజయలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

అశ్వారావుపేట టౌన్, జూలై 27: వర్షాలు విస్తారంగా కురుస్తున్న నేపథ్యంలో సీజనల్ వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉన్నందున ప్రభుత్వ సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్/పేరాయగూడెం ప్రత్యేకాధికారి కృష్ణప్రసాద్ అన్నారు. ఆయన శనివారం పేరాయగూడెంలో ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. వైద్య, అంగన్‌వాడీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి ఆరోగ్య సర్వే నిర్వహించాలని, వైద్య సహాయం అందించాలని అన్నారు. పంచాయతీ సిబ్బంది ప్రజలకు మంచి నీటిని అందించాలని, వాటర్ పైప్‌లైన్ల లీకేజీలు లేకుండా చూడాలని ఆదేశించారు. పంచాయతీ కార్యదర్శి బంగారు సందీప్, గుమస్తా ముసికి రమణ తదితరులు పాల్గొన్నారు.

కార్మికుల ఆశలు అడియాసలు

మణుగూరు టౌన్, జూలై 27: కార్మికులకు హామీల ఆశను చూపి కాంగ్రెస్ అనుబంధ కోల్ మైన్ యూనియన్ గెలిచిన తర్వాత కార్మికుల ఆశలను ఆ యూనియన్ జనరల్ సెక్రటరీ, రాష్ట్ర మినిమం వెజేస్ అడ్వైజరీ బోర్డు చైర్మన్ జనక్ ప్రసాద్ అడియాసలు చేశారని టీబీజీకేఎస్ బ్రాంచి ఉపాధ్యక్షుడు నాగెల్లి వెంకట్ అన్నారు. శనివారం మణుగూరులో ఆయన మాట్లాడారు. ఇచ్చిన హామీల్లో ఇన్‌కం ట్యాక్స్ యాజమాన్యం చెల్లింపు, సొంత ఇంటి పథకం కింద కార్మికునికి 250 గజాల స్థలం, 20లక్షల వడ్డీ లేని రుణం లాంటి హామీల అమలుపై స్పష్టమైన హామీ ప్రకటిస్తారని భావించారని కానీ కార్మికులకు అసంతృప్తి మిగిల్చారని అన్నారు. ఫిట్టర్ బదిలీల నిలుపుదల విషయం వచ్చినా ఉత్సవ విగ్రహంలా నిలబడటంతో కార్మికులు ఆత్మస్థైర్యాన్ని కోల్పోతున్నారన్నారు. ఇప్పటికైనా కార్మికులకు అండగా నిలవాలని ఆయన డిమాండ్ చేశారు.

షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

మణుగూరు టౌన్, జూలై 27: మున్సిపాలిటీ పరిధిలోని విఠల్‌రావు నగర్‌లోని జర్పుల హతిరాం ఇంట్లో శనివారం తెల్లవారుజామున షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధమైంది. దీంతో ఇంటి సామాన్లు మొత్తం కాలిపోయాయి. విషయం తెలుసుకున్న రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వివరాలు సేకరించారు.

పామాయిల్ ఫ్యాక్టరీలో కార్మికుడికి గాయం

అశ్వారావుపేట టౌన్, జూలై 27 : ఓ కార్మికుడికి ప్రమాదవశాత్తు గాయమైన ఘటన మండల కేంద్రంలోని పామాయిల్ ఫ్యాక్టరీలో చోటు చేసుకుంది. ఫ్యాక్టరీ మేనేజర్ నాగబాబు తెలిపిన వివరాల ప్రకారం.. పేరాయగూడెంకు చెందిన తగరం వెంకటేశ్వరరావు ఫ్యాక్టరీలో దినసరి కార్మికుడిగా పని చేస్తున్నాడు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి డ్యూటీ చేస్తుండగా అర్ధరాత్రి సమయంలో కన్వేయర్ బెల్ట్ యంత్రంలో కార్మికుడి కుడి చేయి పడి పూర్తిగా దెబ్బతిన్నది. వెంటనే తోటి కార్మికులు ఖమ్మం ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. పూర్తిగా దెబ్బతిన్న చేయిలోని కొంత భాగాన్ని వైద్యులు తొలగించినట్లు మేనేజర్ తెలిపారు.

గుండెపోటుతో ఏఎస్సై మృతి

చంద్రుగొండ, జూలై 27: చంద్రుగొండ ఏఎస్సై ఉబ్బన శ్రీనివాసరావు(60) గుండెపోటుతో శుక్రవారం రాత్రి మృతిచెందారు. ఆయన శుక్రవారం అశ్వారావుపేట ఎమ్మెల్యే జారె ఆదినారాయణకు బందోబస్తు విధుల్లో ఉండగా గుండెపోటు వచ్చింది. ఖమ్మం ఆసుపత్రికి తరలించినప్పటికీ ఫలితం కనిపించలేదు. ఆయన అక్కడే మృతి చెందారు. మండల కేంద్రమైన కల్లూరుకు చెందిన ఉబ్బన శ్రీనివాసరావుకు భార్య, ఇద్దరు సంతానం ఉన్నారు. మృతదేహాన్ని జూలూరుపాడు సీఐ ఇంద్రసేనారెడ్డి, ఎస్సై జి.స్వప్న సందర్శించి నివాళులర్పించారు.

మోసగాడు బైండోవర్

దుమ్ముగూడెం, జూలై 27: భూత వైద్యం పేపరుతో అమాయకుల నుంచి డబ్బు దండుకుంటున్న మోసగాడిని పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. దమ్మపేటకు చెందిన రేపల్లె తిరుపతి, తానొక భూత వైద్యుడినని చెప్పుకుంటూ మండలంలో తిరుగుతున్నాడు. అనారోగ్యంతో బాధపడుతున్న వారి వద్దకు వెళ్లి, భూతం పట్టిందని నమ్మించి, దానిని తరిమికొడతానని చెప్పి, ఖర్చుల కోసమని వేలల్లో వసూలు చేస్తున్నాడు. సంతానం లేని వారిని కూడా ఇలాగే మోసగిస్తున్నాడు. స్థానికులు కొందరు ఇచ్చిన ఫిర్యాదుతో ఈ మోసగాడిని పోలీసులు శనివారం అదుపులోకి తీసుకుని, ఎక్జిక్యూటివ్ మెజిస్ట్రేట్ వద్ద బైండోవర్ చేశారు.

యువకుడి ఆత్మహత్య

పాల్వంచ రూరల్, జూలై 27 : మండలంలోని జగన్నాధపురంలో ఉన్న ఓ ప్రైవేట్ ఫంక్షన్‌హాల్‌లో వాడే ప్రవీణ్(22) అనే యువకుడు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన శనివారం చోటుచేసుకున్నది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. చుంచుపల్లి మండలం పెనగడప పంచాయతీ ములుగుగూడెంకు చెందిన ప్రవీణ్ కారుడ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ నెల 25వ తేదీన డ్రైవింగ్‌కు వెళ్తున్నానని చెప్పి ఇంటినుంచి బయటకు వెళ్లాడు. రెండురోజులైనా ఎటువంటి సమాచారం లేకపోవడంతో ప్రవీణ్ ఆచూకీ కోసం తండ్రి ధర్మయ్య గాలింపుచర్యలు చేపట్టాడు. జగన్నాధపురంలోని ఫంక్షన్‌హాల్‌లో ప్రవీణ్ శనివారం తువాలుతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడి ఉండటాన్ని గుర్తించి స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. తండ్రి ధర్మయ్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గంజాయి కేసులో వ్యక్తి అరెస్ట్

అశ్వారావుపేట టౌన్, జూలై 27 : గంజాయిని అక్రమంగా సరఫరా చేస్తున్న కేసులో శనివారం ఓ వ్యక్తిని అరెస్టు చేసినట్లు అశ్వారావుపేట సీఐ కరుణాకర్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. ఏపీ రాష్ట్రంలోని అల్లూరి సీతారామరాజు జిల్లాదారకొండ నుంచి హైదరాబాద్‌లోని దూల్‌పేటకు పనసకాయల లోడు మాటున గంజాయిని తరలిస్తున్నారు. ఈ క్రమంలో మే 25న అశ్వారావుపేట సాయిబాబా టెంపుల్ వద్ద వాహనాలు తనిఖీ చేస్తుండగా అప్పటి ఎస్సై శ్రీనివాస్‌కు రూ.89.83 లక్షల విలువ చేసే 359 కేజీల గంజాయి పట్టుబడినట్లు సీఐ తెలిపారు. ఈ కేసులో ఓ మహిళతో పాటు మరో పది మంది వ్యక్తులపై కేసు నమోదైంది. గంజాయి పట్టుబడిన సమయంలో తొమ్మిది మందిని అరెస్టు చేయగా.. ఆదిలాబాద్‌కు చెందిన కొట్నాక్ రమేశ్ అనే వ్యక్తి పారిపోయాడు. కాగా.. పరారీలో ఉన్న రమేశ్‌ను శనివారం హైదరాబాద్‌లో అరెస్ట్ చేసి కొత్తగూడెం కోర్టుకు తరలించినట్లు వివరించారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్ Classifieds

పేరు మార్పు

భద్రాద్రి కొత్తగూడెం జిల్లా, పాల్వంచ మండలం, H.NO.6-1-5/B, ఒడ్డుగూడెం గ్రామానికి చెందిన **శ్రీమతి బాడపాటి వత్సుబాయి**,W/o. బాడపాటి లక్ష్మీపతి, Age: 41yrs, అను నేను నా యొక్క పేరును **బాడపాటి వసంత**గా మార్చుకొనుచున్నాను. ది.27.06.2024న నోటరీ లాయర్ అక్తర్ గారి దగ్గర పేరు మార్పు కొరకు నోటరీ చేయించడం జరిగినది. పై రెండు పేర్లను ఒకే పేరుగా పరిగణించగలరని మరియు పేరు మార్పుపై ఏలాంటి ఫిర్యాదులు అందిన దానికి నేనే బాధ్యత వహిస్తానని తెలియజేయుచున్నాను.

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ

నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073

నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616